# అమ్మపేరు - చీకటి

## విహారి

ఇల్లంతా అలంగం తిరిగింది. పెరట్లో కనకాంబరం చెట్ల దగ్గర చాలా సేపు కూర్చుంది. దొడ్లో నూతి గట్టు మీదా గడిపింది.

నంజ ముదిరి చీకటి పరచుకుంటోంది.

ముందు గదిలో కిటికీ దాకా నడిచింది. ఏదో నిప్పుల్లోంచి నడుస్తున్నట్టే ఉన్నది.

నిమ్మళంగా కూర్చుంది. కొంగుపరుచుకుని, నుదురు మీద చెయి పెట్టుకుని వెల్లకిలా పడుకుంది. రెప్ప వాల్చకుండా పై కప్పు కేసి చూస్తోంది.

ఓ గంట క్రితం జరిగిం దంతా కళ్ళల్లో మెదలుతోంది. శారదమ్మ గొంతులో భయం కర్ర బిరడాలాగా బిగిసింది. మన నంతా ముళ్ళ పొదలా ఉంది. అస్తిమితంగా పక్కకి తిరిగింది. మొహాన్న ఛెళ్ళున చల్లింది - వాస్తవం.

ఓ గంట క్రితం-

మునెయ్య వచ్చాడు. నెల కిందట వెళ్ళిన మనిషి. ఎక్కడికి పోయొచ్చాడో తెలీదు.

"ఎక్కణ్ణుంచీ రావడం?" అడిగింది. మంచినీళ్ళ చెంబు అందించింది.

నీళ్ళు తాగాడు. నమాధానం లేదు.

మళ్ళీ అడిగింది.

"ఊఁ" అని దీర్ఘం తీసి తనతో చూపు కలిపాడు. ఏదో చెప్పబోయాడు, ఏఁవీ చెప్పలేదు.

'శిల! ఏఁవీ మార్పు లేదు.' తన మనస్సు గొణుక్కుంది.

మంచం మీంచి లేచాడు. "తాళా లేవీ?"

దిండు కింది తాళాల గుత్తి తీసి ఇచ్చింది. పెనప్పెట్టె తెరిచి నోట్ల కట్ట జేబులో పెట్టుకున్నాడు. తాళం వేసి తాళం చెవులు అందించాడు. తీసుకుంది.

అన్యమనస్కంగా ఉన్నాడు. అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. క్షణాల తర్వాత - గుమ్మం దాటుతుంటే అడిగింది - ఉండబట్టలేక - "వెళ్తున్నారా?"

"ఊఁ"

"ఎక్కడికి?"

"_____"

"భోంచేసి వెళ్ళండి."

"అఖర్లే."

"ఎప్పుడు మళ్ళీ రాక?"

"_____"

ఆయన అడుగులు ముందుకు సాగినై.

తన కళ్ళల్లో నీళ్ళు తిరిగినై. ఆకులు రాలిన చెట్టులా - బోసిగా - గుమ్మం దగ్గరే ఆగిపోయింది.

ముప్పై ఏళ్ళ క్రితం-

పెళ్ళయిన కొత్తలో:

మనిషి తత్వం పూర్తిగా అర్థం అయీ, అవని రోజుల్లో ముభావపు స్వభావం అని సరిపుచ్చుకుంది. చచ్చి ఏ లోకాన ఉన్నదో - అమ్మ అంది ఓసారి, "లోతు మని షన్న మాట. నిండు కుండ. అయితే మరీ మంచి ది." ఆస్తిపాస్తులూ, అదృష్టాల్ని గురించి ఆమె మురిసిపోతుంటే-

నిజంగానే, బంగారు కొండ నెత్తిన పడినట్లు సంతోషపడింది తాను.



త్వరలోనే తెలుసుకుంది - సముద్రం ఒడ్డున పిచ్చుక గూళ్ళు కట్టుకుంటోంది తాను - అని. తొలి చూలుకి తన నుంచి ఏ ముద్దూ మురిపెం లేదు. భార్యా భర్తల సాన్నిహిత్యం లేదు. ఏ ఒక్కనాడూ ఏమీ లేనట్టే, ఏమీ ఎరగనట్టే గడిచిపోయాయి రోజులు.

మనసు నొప్పించడం, అల్లరి చేసుకోవడం, గత్తరా - తనకు తెలీవు. అందుకనే, దీప స్తంభంలా మిగిలిపోయింది.

రంగారావ్ పెరిగి పెద్దవాడవుతున్నా - ఓ అచ్చటా ముచ్చటా పట్టించుకున్నది లేదు. అన్నిటికీ తన ఆరాటమే. అంతా తన ఘోషే.

త నెంత జాగ్రత్తగా ఉన్నా జరిగేది జరిగింది. వాడికీ చదువు అబ్బలేదు. జులాయి తిరుగుళ్ళు పట్టుబడినై. నెత్తీ నోరూ కొట్టుకుంది. చలనం లేదు మనిషిలో!

ఆ రోజు - తన కింకా స్పష్టంగా గుర్తు!

రాత్రి పదకొం డయినా ఇల్లు చేరలేదు రంగారావు. తన ప్రాణం గిలగిల్లాడుతోంది. మనసు ఏదో కీడుని శంకిస్తూ గాలిలో దీపంలా రెప రెప లాడుతోంది. కాలు గాలిన పిల్లిలా ఇల్లంతా తిరుగుతోంది. వంద సార్లు తనలో తాను గొణుక్కుని, కనీసం పది మార్లు పైకే అన్నది. తన ఆరాటం, తపన - తనవి గానే ఉండిపోయినై. బెల్లం కొట్టిన రా యల్లే ఉండిపోయాడు.

పన్నెండింటికి వచ్చాడు వాడు. మనిషి కళ్ళల్లో ఎర్ర జీరలు, కాళ్ళల్లో తూలుడూ!

తడిగుడ్డను మెలిపెట్టినట్టు గుండెల్లో బాధ. పద్దెనిమి దేళ్ళకే ఇంత వాడైన కొడుకును చూసి కుమిలి కుమిలి తను ఏడుస్తుంటే - వెళ్ళి గదిలో దూరి తలుపేసుకున్నాడు.

"ఏఁవి తండ్రిరా భగవాన్" - అని కన్నీటి ముత్యాల్ని రాల్చింది. పెరట్లో వేప చెట్టు కింది నవారు మంచంలో పడి - కొలిమిలో కమ్మీలా అయిన తనను చూసి జాలి పడిం దెవరు? ఆకాశంలో బిక్కచచ్చిన ఒంటరి చుక్క.

మరో రెండేళ్ళకి - రంగులన్నీ ఫెళ్ళున తెలిసినై. కొడుకు రాజకీయాల్లోకి దిగితే - తండ్రి వాడికి నిచ్చెన కావాలని నిర్ణయించుకున్నాడు. చెట్టు మొదలున చెద చేరడం మొదలైంది.

అక్కణ్ణుంచీ - వా ళ్ళిద్దరి బతుకు వేగము హెచ్చింది; దారీ త్వరత్వరగా మారిపోయింది. వచ్చే . జనం, పోయే జనం - ఇల్లంత రాఁవంధాళీగా, రైల్వే స్టేషన్‌గా ఉండటం మొదలైంది. వంటా వార్పూ చూసేందుకు తనకు మనసు చచ్చిపోయింది. సుగుణమ్మ వచ్చింది. తానేమో ఏదో వేళలో ఓ ముద్ద నోటి కెక్కించుకుని గ్లాసుడు నీళ్ళు తాగడం. వాళ్ళేమో - వాళ్ళ రాకపోకలేమో, తనకు తెలిసేవి కావు. వాడే - ఎప్పుడో వచ్చి ఏదో పొడి పొడి మాటలు మాట్లాడే వాడు.

తన నెత్తిన నీళ్ళ కుండ పొంగి పొరలేది. పరామర్శ - గుండెని కోసేది. "చాల్లే - చాల్లే" అంటూ జారుకొనే వాడు. ఓ పండగా పబ్బం లేదు. మంచీ చెడూ చెప్పుకోవడం లేదు. పోనీ, సొదలు కలబోసుకోవడమూ లేదు,

"అడవిలో మానులా ఏఁవిటే అమ్మా? నిన్ను చూస్తుంటే కడుపు చెరువౌతున్నదే శారదమ్మ తల్లీ" అని ఏడ్చి ఏడ్చి ఓ దుర్దినాన అమ్మా రాలిపోయింది. వదినమ్మను పలకరించి పోవడానికి పెద్ద మనసుతో పుట్టింటి గడప తొక్కింది - సుమతి.

చెల్లెల్ని చూసి తోక తొక్కిన పాములా బుస్సు మన్నాడు. "మునెయ్యి మా టంటే - కాలంతో చివికి పొయ్యే తాటాకు గాదు. వీల్లేదు. సు వ్వీ గడప తొక్కడానికి వీ" ల్లేదని - పసారా మెట్టు మీదే ఖరా ఖండీగా చెప్పేశాడు. సుమతిని అదే తాను మొదటిసారి చూడటం! ఏవో చిన్నతనపు పట్టుదలల గురించి తాను వినే ఉన్నా - తీరా ఒకరి కొకరు ఎదురుపడ్డా ఇట్టా జరుగుతుం దనుకోలేదు.

రోషంతో, ఉక్రోషంతో - పాపం వెనుదిరిగింది సుమతి. తనకే మన సాగక, చేతుల్లోకి తీసుకుని ఆ మెట్టు మీదే కూలబడిపోయింది. బ్రతిమాలినా బామాలినా ఆ మనిషి నెవరు మార్చగలరు?



ఇంత వసువూ కుంకుమా ఇచ్చి కడివెడు కన్నీళ్ళతో పంపించింది - ఆడపడుచును.

ఇంతకీ - ఆ యమ్మ జేసిన నేర మేఁవిటి? నరసింహాన్ని పెళ్ళి చేసుకోవడం. ఆ కుటుంబానికీ, ఈ కుటుంబానికీ మున్నెన్నడో పాత కక్షలు ఉన్నాయిట. ఈ ఇంటి మీది కాకి ఆ ఇంటి మీద వాలదట. నరసింహం తాతో, ముత్తాతో - ఈ ఇంటి వారి బంధువు నెవర్నో చంపించా డట.

అహంకార తాండవాల మధ్య ఆడపిల్ల మన సెవరి గ్గావాలి గనుక? రంగారావూ అత్త కేసి పురుగేరినట్లే చూశాడు. 'ఎంతకు లేడు - వీడు' అనిపించింది. అవును మరి - వాడూ ఆ తానులో ముక్కేగా?

తండ్రీ కొడుకులకి ఆకలి కాని ఆకలీ; తృష్ణ కాని తృష్ణా వెంటాడ సాగినై. ఇద్దరూ ఇంట్లో తనతో ఏఁవీ మాట్లాడకపోయినా - జరుగుతున్న భాగోతం, సాగుతున్న వ్యవహారం - తనకు తెలుస్తూనే ఉన్నై. పాలేర్లు నవ్వుకోడాలూ; ఊరి వాళ్ళ ఎకసెక్కేలూ; ఏ పేరంటానికో - మనసు పుట్టి వెళితే - అమ్మ లక్కల చూపుల్లో, వంకర మాటల్లో - తా నెంత 'అదృష్టవంతురాలో' తెలిసిపోతూ ఉండేది!

ఎప్పుడో హఠాత్తుగా ఊడి పడి బీరువాలో డబ్బు గుమ్మరించి పోవడం, లేదా తీసుకుపోవడం - తండ్రీ కొడుకుల్ని తాను చూసేది అలాం టప్పుడే.

ఏఁవీ అంతుపట్టేది కాదు - అన లా డబ్బు, అంతంత డబ్బు ఎలా వస్తున్నదో, ఎక్కణ్ణుంచి వస్తున్నదో తెలిసేది గాదు.

ఒకసారి నుగుణమ్మ అన్నది - "బాబు పెద్ద పెద్ద ఫ్యాక్టరీల్లో యూనియన్లకి లీడరంట. అతని మా టంటే వేదవా క్కంట. అత నంటే మన జిల్లా అంతకీ, అందరికీ సింహ స్వప్నంట. అయ్యగారు ఈసారి ఎమ్మెల్యే అవుతా రంట."

తన కెందుకనో గానీ గుండె గుబ గుబ లాడింది. తనకూ అంతో ఇంతో దేశ కాల పరిస్థితులు తెలుసు. 'ఈ రాజకీయం ఎంత వరకూ పోతుందో - ఏమో' ఇదీ తన భయం. పత్రికలు జూస్తుంటే - ఈ రోజుల్లో పోకడలు తెలుస్తూనే ఉన్నై.

ఓ రోజు ఒంటరిగా చూసి అడిగింది, "ఎందు కండీ మీ కీ రొష్టు? తినా కుడువా బోలెడంత ఉంది. వాడికి అచ్చటా ముచ్చటా తీర్చి, కృష్ణారామా అనుకుంటూ కాలం గడిపితే...."

"ఇంకా ఆ వయస్సు రాలేదులే" అంటూ అదే చూపు - తన నోరు నొక్కే చూపు; తన గళం పడిపోయే చూపు! నల్లికిళ్ళ పాములాగా వెళ్ళిపోయాడు.

ఎన్నిక లొచ్చినై. అదంతా ఒక రొద; అదంతా ఒక గచ్చపొద! ఆ చీకటి చదరం వైపు - ఎంత వద్దనుకున్నా చూడక తప్పలేదు. ఎన్నిక తేదీకి ఇంకా వారం ఉంది. ఆ రోజూ, ఇలాగే సంజ వెలుగుల్ని తెరలు తెరలుగా చీకటి కబళిస్తున్న వేళ -

అంతా అయిపోయింది! తా నా వార్త విని మొదలు నరికిన చెట్టులా కూలిపోయింది. నెత్తిన వెయ్యి మణుగుల గుయ్యారం, లక్ష టన్నుల అయోమయం పెట్టినట్లయింది. కొడుకుని కోల్పోయింది తను.

దేవుడు ఎంత నిరంకుశుడో, అంత పాశవికుడు కూడా కాబోలు. తనకు చావు రాలేదు.

గర్భశోకాన్ని గరళంలా మింగింది. సామాను గదిలో ఓ మూల చాప చుట్టలా పడి ఏడుస్తుంటే - ఒక్కసారి - కనీసం ఒక్క సారన్నా - ఓ చల్లని ఉపశమనపు మాట అనలేదు. పగలూ రాత్రీ తెలీకుండా గడిచిపోయింది.

ఆ రాత్రి - లేని ఓపిక తెచ్చుకుని, నిమ్మళంగా ఆయన గదిలోకి వెళ్ళి మంచం పక్కన నుంచుంది. లాలనగా చేతిని తన చేతిలోకి తీసుకుంటే.....

ఉఁహూఁ! తను గుండె పగిలేలా పొరలి పొరలి, వెక్కి వెక్కి ఏడ్చేసింది గానీ ఆయన చలించ లేదు. గుండెల్లో వలుగు పెట్టి పొడిచిన ట్లైంది. అతి కష్టం మీద గది లోంచి బయట పడింది.

అధ్వాన్నంగా అయిపోయింది - తన జీవితం.

ఎన్నికలు అయినై. ఎమ్మెల్లే అయ్యారు. ఊరు కిరీటం పెట్టింది. ఎవరు ఓడి ఎవరు గెలిచారో, ఎవరు గెలిచి ఎవర్ని ఓడించారో?

వేడి చల్లారేలోగా మరో తల లేచింది. ఈతన పత్తా లేడు. అందరి నోళ్ళల్లోనూ అదే మాట. ఈ హత్యకి ఈయనే కారణం అని.

అదుగో అప్పట్నుంచీ మొదలైంది - మరో అవస్థ. ఏ నిశీధిలోనో ఇంటికి రావడం, డబ్బూ దస్కం తీసుకోవడం; జీపులో పది మంది అంగరక్షకుల మధ్య మళ్ళీ వెళ్ళిపోవడం.

ఎక్కడ ఉనికో, ఏమి ఉపాధో తెలీదు.

ఎన్నో గంటలు, ఎన్నో పగళ్ళు, ఎన్నో రాత్రులు, ఎన్నెన్నో రోజులు ఏమేమిటో - ఎంతగానో

## వి'స్మృతులు'

దుమ్ము కొట్టుకుని మాసిపోతుంటే
ఏనాడైనా
ఇంత అనురాగం నబ్బుబిళ్ళతో
ఉతికి భద్రపరచానా?
కొత్త కొత్త పరాగాల
పరిమళాల పేరంటాలకి,
వినూత్న స్రవంతుల సంబరాలకి
రెండు లిప్తలు వెనక్కి వెళ్ళి
పంక్తిలోకి పిలిచానా?
ఏ ఆలనా పాలనా లేకుండా
దిక్కుమాలిన వాటిల్లా
ఎంత కాలమని పడి ఉంటాయి?
అందుకే ఎప్పుడో,
నిశ్శబ్దంగా వదిలి వెళ్ళిపోయినై !
ఇవ్వాళ
జు.ట్టు పీక్కున్నా
తల కొట్టుకున్నా
ఆలోచనల అగాధాల్లో
భావాల బజార్లలో
వెర్రిగా వెదుకులాడినా
వాటి జాడేలేదు-
ఎప్పుడో నాకు
విడాకు లిచ్చేసి వెళ్ళిపోయినై
నా జ్ఞాపకాలు !

-వై. రామకృష్ణారావు

ఫోటో: ఎస్.డి. సింగ్ [క్లోజప్]



ఆలోచించింది. మనిషి మనిషిని ఎందుకు చంపుకోవాలి? తెల్లవారి లేస్తే ఎన్నిసార్లు మనసును చంపుకోవాలి అసలు? ఇదంతా ఎందుకు? ఏం సాధించడానికి?

వేదాంతం కాబోలు. ఒక ప్రశ్న గురించి ఆలోచిస్తూ ఉండగానే, మరో ప్రశ్న పుట్టి, పెరిగి.... 'నభో మండలంబంతై' హఠాత్తుగా విరిగి, అధఃపాతాళంలో పడిపోతుంది. ఈ విచికిత్సల మధ్యలో తా నుండగానే మరో అశనిపాతం!

కాదు, మరో శని పట్టింది. పేరు మాణిక్యంట! మకాం రాజధానిలో.

మునసబుగారి తల్లి - లచ్చుమ్మ ఓనాడు చెప్పింది - "ఏం చెప్పను శారదమ్మా. నా మనవరాలు చిన్నమ్మ లేదూ, వాళ్ళింటికి పోయాను. అప్పుడు చూశాను. పార్కింటూ తీసుకుపోతే అక్క డున్నాడు మునెయ్య. పక్కన ఆ శని గ్రహం. పాడు ముండ. ఒంగోలు గిత్తలా అంతెత్తు ఉంది. ఒంటి నిండా కండలు. పందెపు గుర్రంలా మిస మిస లాడుతోంది."

ఇహ ఆపుకోలేకపోయింది తను. ఒళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకినట్లైంది. మొహం చాటు చేసుకుని లచ్చుమ్మ ఎదుటి నుంచీ తప్పుకుపోయింది. గుడ్ల నీరు గుడ్ల కుక్కుకుని పక్క గదిలోకి పరిగెత్తింది. పెనంలో నుంచి పొయ్యిలోకి పడిపోయింది. బందిల దొడ్డిలో పడ్డ గొడ్డులా అయింది; లోకంలో చోటు తక్కువైన ట్లనిపించింది.

మనిషిని ముద్దగా చేసి మింగుదా మన్నంత కోపం. మేదర కత్తితో ముక్కలు ముక్కలు చేద్దా మన్నంత కసి. మొగుడూ లేదు, మొద్దూ లేదు - మగ వాడన్న వాణ్ణి నిలువునా ఉప్పు పాతర వేయా లన్నంత క్రోధం.

కానీ, ఏమీ చేయలేని నిస్సహాయత!!

ఆ తర్వాత, ఇన్నాళ్ళ కిన్నాళ్ళకి ఇవ్వాళ వచ్చాడు; అవును - వచ్చి గంట క్రితం వెళ్ళిపోయాడు! ఏం చేసింది? జవాబు లేని ప్రశ్న.

ఆలోచనల తోనే తెల్లవారింది. తెల్లవారుతూనే వచ్చాడు, సుమతీ వాళ్ళ ఊళ్ళో ఓ పాలేరు. వార్త విని నిశ్చేష్టురాలైంది - శారదమ్మ. నోట మాటా రాలేదు.

సుమతి కూతురు చనిపోయింది. పదహారేళ్ళ పిల్ల. మన సంతా కలచినట్లైంది. వివరాలు చెప్పిపోయాడు వచ్చి సతను. పదో తరగతి చదువుతూనే ప్రేమలో పడిందట - ఆ పిల్ల. తల్లీ తండ్రీ చీవాట్లు పెట్టారు. పురుగుల మందు తాగి, పోయింది.

శారదమ్మ గోడక్కొట్టిన పిడకలా ఉండిపోయింది. ఓ గంట తర్వాత - తెప్పరిల్లుకుని తెలివి తెచ్చుకుంది. ఆలోచనల పూసలు కూర్చి కూర్చి, కడకు ఒక నిశ్చయాని కొచ్చింది. ఒక తెగింపు తెచ్చుకుంది. సుగుణమ్మకు చెప్పి, సుమతి ఊరికి వెళ్ళిపోయింది.

నాళ్ళు గడచినై. ప్రహరీ గేటు తెరచుకుని లోపలికి నడుస్తోంది, శారదమ్మ. వసారా మెట్లు దాకా వచ్చింది.

"ఆగు!" మర ఫిరంగు మోగినట్లు - హెచ్చరిక.

ఉలిక్కిపడింది. తల పైకెత్తి చూసింది. వరండా స్తంభాని కానుకుని మునెయ్య. కళ్ళు చింత నిప్పుల్లా ఉన్నాయి. మనిషి కోపంతో ఊగిపోతున్నాడు. కొరకొరలాడుతున్నాడు.

"ముప్పై ఏళ్ళు కాపురం చేశావ్. ఈ ఇంటి పరువు మర్యాదలూ, పట్టుదలలూ, పట్టింపులూ - నీకేం పట్టలేదా?"

"ముప్పై ఏళ్ళ కాపురం!" అవును. చేసింది! చిత్రమైన నవ్వు నవ్వుకొంది, శారదమ్మ.

ముప్పై ఏళ్ళ తర్వాత - మూడు మాటలు. మాట్లాడుతున్నాడు మునెయ్య... మగడు! ముచ్చటగా ఉంది శారదమ్మకు.

మౌనాన్ని పాటించి, మరో మెట్టు ఎక్కింది.

గర్జించాడు మునెయ్య: "ఎక్కువ మాట్లాడటం నా కిష్టముండదు. ఒకే మాట. నరసింహం ఇంటి మీద వాలిన కాకిని కూడా కాల్చి పారేస్తాను. అంతే. ను వ్వీక మీదట ఇక్కడ ఉండక్కర్లేదు." విసురుగా వెళ్ళిపోయాడు లోపలికి.

సుగుణమ్మా పాలేరు గుడ్లప్పగించి చూస్తూ నిలబడిపోయారు.

బొమ్మలా కూర్చుండిపోయింది - శారదమ్మ.

గాలి స్తంభించింది. ఏరు కంఠం పూడుకుపోయింది.

చాలా సేపటికి, మెట్టు మీద నుంచి లేచింది - శారదమ్మ.

ఇప్పుడు ఇంటి చుట్టూరా అలంగం తిరిగింది. పెరట్లో కనకాంబరం చెట్ల దగ్గర కూర్చుంది. దొడ్లో నూతి గట్టు మీదా గడిపింది.

నంజ ముదిరి చీకటి పరుచుకుంటోంది. శారదమ్మ, సుమతి, సుమతి కూతురు - ఎవరైతేనేం - ఒక్కొక్కరూ ప్రతి ఒక్కరూ కన్న పిల్లలే. ఆడపిల్లలే.

ముసిరిన చీకటికి ఆడపిల్ల లంటేనే మరింత మక్కువ కాబోలు ! అందుకనే నేమో వాళ్ళని తన దగ్గరే, తనలోనే, తన కడుపులోనే పెట్టుకుని సాకుతుంది! ◆

## రాకాసి ముళ్ళమొక్క

ఇంత గడిచిన బతుకు పయనం
ఎన్ని క్షుభిత హృదయాల తివాచీల మీద
విషాద నిర్దయ ముద్రలు విడిచిందో
ఇంత సుదీర్ఘ తమ స్సమాధి
ఎన్ని కాంతి దర్శనాలు తిరస్కరించిందో
చుట్టుముట్టిన ఫలాపేక్ష రహితాత్మ లెన్ని విసర్జించబడినవో.
గడచిన కాలాన్ని సలంకృత అహం సహా
నిమ్మాచీగా నిష్పేచీగా దాటి-
నేటికి-
ఐచ్ఛికంగా చివికిన సిలుకు దారాలతో
అల్లుకున్న బంధనాలలో-
చిక్కుకుని బంధనాలలో-
చిక్కుకుని ఉన్న అమృతభాండాన్ని-
పిచ్చినీళ్ళతో శుద్ధి చేశాను.
ఇప్పు డిక పక్కున నవ్వినా
గొల్లున ఏడ్చినా
కన్నీళ్ళు వెల్లువైనా-
పట్టి నీరే-
చిక్కబట్టిన గుండె-
పగలదు.
ఒక్క కన్నీటి బొట్టూ నీకోసం-
ఆత్మీయంగా రాలదు.
నీవు లేని తనాన్ని-
గుర్తించే గుండే లేదు.
మహాశూన్యంలో మిగిలిన
రాకాసి ముళ్ళమొక్క.

-వాణీ రంగారావు

